క్లుప్తంగా

హక్కులు తెలుసుకోవాలి

కోట: రాజ్యాంగం ప్రసాదించిన హక్కుల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని తహసీల్దార్ పద్మావతి సూచించారు. మండలంలోని వంజివాకలో శుక్రవారం సివిల్‌రైట్స్‌డే నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ హక్కుల గురించి అవగాహన కల్పించేందుకు గ్రామాల్లో చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఎస్‌ఐ పుల్లారావు, ఎంఈఓ వెంకట సునీల్, వీఆర్వో కృష్ణయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సరస్వతీ దేవి పూజ

చిట్టమూరు: మండలంలోని ఆరూరు జెడ్పీ హైస్కూలులో శుక్రవారం విద్యార్థులు భక్తి శ్రద్ధలతో సర్వతీదేవికి పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని సరస్వతీ దేవి విగ్రహానికి పూజలు చేసి, పురోహితుల ఆశీర్వాదం తీసుకున్నారు. హెచ్‌ఎం జ్యోతి, ఉపాధ్యాయులు చలపతి, వెంకటేశ్వర్లు, హరిబాబు, పుష్పలత పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు ఐదుగురి ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈఓ శైలజ

ఓజిలి: మండలంలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు నేషనల్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్)నకు ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ఎంఈఓ శైలజ తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ మండలంలో ఈ స్కాలర్‌షిప్ పరీక్షకు 60 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా ఓజిలి ఉన్నత పాఠశాల నుంచి నలుగురు, అత్తివరం నుంచి ఒక విద్యార్థి ఎంపికయ్యారన్నారు. విద్యార్థులు స్కాలర్‌షిప్‌లకు ఎంపికయ్యేలా బోధించిన ఉపాధ్యాయులు, విద్యార్థులు తురకా శ్రీహరి, వేముల సంజన, పఠాన్ ఫయిజా, కే స్వర్ణ, జీ మమతను ఎంఈఓ అభినందించారు.

పౌష్టికాహారం పంపిణీ అభినందనీయం

గూడూరు: హెచ్‌ఐవీ బాధితులకు పౌష్టికాహారాన్ని అందజేయడం అభినందనీయమని ప్రముఖ వైద్యుడు జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో శుక్రవారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రొటేరియన్ వీ శివరామిరెడ్డి దాతృత్వంతో హెచ్‌ఐవీ బాధితులకు పౌష్టికాహారాన్ని డాక్టర్ జనార్దన్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ రొటేరియన్ దశరథరామిరెడ్డి, శ్యామ్‌యాదవ్, పీవీ కృష్ణయ్య, డాక్టర్ చంద్రహాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

చిట్టమూరు: మండలంలోని వడ్డికండ్రిగ గ్రామానికి చెందిన యనమల శివ అనే వ్యక్తికి కొత్తగుంటలోని టీఎమ్మార్ స్కూల్ విద్యా సంస్థల అధినేత టి మనోహర్‌రెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. శుక్రవారం పాఠశాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రూ.30 వేలు అందజేశారు. కొద్ది రోజుల క్రితం వడ్డికండ్రిగలో యనమల శివకు చెందిన పూరిల్లు అగ్నిప్రమాదంలో పూర్తిగా కాలిపోయింది. దీనిపై మనోహర్‌రెడ్డి స్పందించి, బాధితుడికి ఆర్థిక సాయం అందజేశారు. పాఠశాల డైరెక్టర్ విజయలక్ష్మి, ప్రిన్సిపల్ రహంతుల్లా, మేనేజర్ ఆశ శ్రీనివాసులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు



మాట్లాడుతున్న ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి

నాయుడుపేట: మండలంలో తాగునీటి ఎద్దడి తలెత్తితే, దాని నివారణకు చర్యలు చేపట్టాలని ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలో పనులు చేసుకునే ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పనులు కల్పించాలన్నారు. పలు పంచాయతీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని, ఇందుకు ఆయా పంచాయతీల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు తోడ్పాటు అందించాలన్నారు. ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్‌రెడ్డికి ఎంపీపీ, ఎంపీడీఓ శివప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు శాలువలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజేంద్ర పాల్గొన్నారు.

అక్రమంగా సిలికా తవ్వకాలు

చిల్లకూరు: మండలంలో పరిశ్రమలకు కేటాయించిన భూముల్లో శుక్రవారం అక్రమంగా సిలికా తవ్వకాలు చేపట్టడంతో గ్రామస్తులు అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళితే.. వేళ్లపాళెం సమీపంలో సర్వే నంబర్ 297లో 350 ఎకరాలు ఏపీఐసీసీకి కేటాయించారు. ఈ భూముల్లో స్థానికంగా ఉండే రైతులు వేరుశనగ సాగు చేస్తున్నారు. అయితే ఇటీవల ఈ ప్రాంతంలో సిలికా లీజులు పొందిన వారు కొంత మంది ఆ భూముల్లో రాత్రి సమయంలో అక్రమంగా సిలికా తవ్వకాలు చేపడుతుండడంతో గ్రామస్తులు అడ్డుకున్నారు. భూములు పొందిన కేపీఐఎల్ సంస్థ ప్రతినిధులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకుని తవ్వకాలను అడ్డుకుని, అక్కడ ఏర్పడిన గుంతలను చదును చేయించారు.

దిగుబడి తగ్గితే బీమా వర్తింపు

చిల్లకూరు: వేరుశెగన పంట కోత ప్రయోగం చేసి, తక్కువ దిగుబడులు వచ్చినట్లు గుర్తిస్తే, సంబంధింత రైతులకు ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పించనున్నట్లు ఏఓ గూడూరు భవాని తెలిపారు. శుక్రవారం ఆమె మండలంలోని చింతవరం కొత్తపాళెంలో వ్యవసాయ సహాయకుడు వెంకటకృష్ణయ్య పర్యవేక్షణలో పంట కోత ప్రయోగం చేపట్టారు. గ్రామానికి చెందిన ఓ రైతు సాగు చేసిన భూమిలో దిగుబడి వచ్చినట్లు గుర్తించారు.

పేదల అభ్యున్నతే జగనన్న లక్ష్యం



తడ: డ్వాక్రా మహిళలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



కోటపోలూరులో బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే

తడ: పేదల అభ్యున్నతే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని టీటీడీ బోర్డు సభ్యులు, ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. వైఎస్సార్ ఆసరా మూడో విడత సంబరాల్లో భాగంగా శుక్రవారం తడకండ్రిగలోని ఓ ప్రైవేటు హోటల్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో కిలివేటి పాల్గొని, మాట్లాడారు. అబద్ధాల చంద్రబాబు అధికారం కోసం డ్వాక్రా మహిళల రుణాలు పూర్తిగా చెల్లిస్తామని, బ్యాంకుల్లో తాకట్టు పెట్టిన బంగారాన్ని మీ ఇంటికి తీసుకు వచ్చి ఇస్తానని, ఎవరూ తిరిగి చెల్లించవద్దంటూ వాగ్దానం చేశారన్నారు. దీంతో డ్వాక్రా మహిళలు, రైతులు రుణాలు చేసి వడ్డీలకు వడ్డీలు పెరిగి కట్టలేని స్థితికి చేరారన్నారు. ఆ సమయంలో పాదయాత్ర చేస్తున్న మన జగన్‌మోహన్‌రెడ్డికి మహిళలు ఈ విషయాన్ని విన్నవించడంతో చలించిపోయి రాష్ట్రంలో డ్వాక్రా మహిళలు బ్యాంకుల్లో ఎన్నికల నాటికి ఎంత అప్పు ఉంటే అంతా తామే నాలుగు విడతల్లో చెల్లిస్తామని, ఒక్కపైసా కూడా కట్టవద్దని భరోసా ఇచ్చారన్నారు. ఆ మేరకు అప్పటికి మహిళల అప్పు రూ.25,600 కోట్లు ఉండడంతో ఆ మొత్తాన్ని నాలుగు భాగాలు చేసి ఇప్పటివరకు మూడు విడతల సొమ్మును పొదుపు మహిళల ఖాతాల్లో జమ చేసి, వారి జీవితాల్లో ఆనందం నింపారన్నారు. అనంతరం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి మహిళలతో కలిసి పాలాభిషేకం చేశారు. తరువాత మూడో విడత ఆసరా చెక్కును అందజేశారు. ఎంపీపీ కే రఘురెడ్డి, ఎంపీడీఓ ఆమోసుబాబు, ఏపీఎం రాజారెడ్డి, డీసీఎంఎస్ డైరెక్టర్ గండవరం సురేష్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు వెంకటేష్, రమేష్, నాయకులు ఎం మునీష్‌రెడ్డి, సుందర్‌రెడ్డి, ఆర్ముగం, కోదండం, హుస్సేన్, శశికుమార్, నందారెడ్డి, రాజ్‌కుమార్, నదియ, మహేష్, రమేష్ పాల్గొన్నారు.

పేదల కోసమే సంక్షేమ పథకాలు

సూళ్లూరుపేట రూరల్: నిరుపేదల కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పలు సంక్షేమ పథకాలు అమలు చేశారని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. శుక్రవారం సూళ్లూరుపేట మండలంలోని కోటపోలూరు–2 సచివాలయంలో పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామ ప్రజలు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికి హారతులు పట్టారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న పథకాల బుక్‌లెట్‌ను అందజేశారు. ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, అల్లూరు రమేష్‌రెడ్డి, బద్దెపూడి మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

పెళ్లకూరు: సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ సురేష్‌బాబు సూచించారు. శుక్రవారం ఆయన బంగారంపేట, చెంబేడు సచివాలయాలను ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఉపాధిహామీ పథకం కింద చెంబేడు రోడ్డుకిరువైపులా నాటిన మొక్కలకు సంరక్షణ కరువై ఎండిపోయినట్లు గుర్తించి, అసంతృప్తి వ్యక్తం చేశారు.

పెరుమాళ్లపాడులో డ్రోన్లతో సర్వే

సైదాపురం: మండలంలోని పెరుమాళ్లపాడు రెవెన్యూ విలేజీలో వైఎస్సార్ శాశ్వత భూహక్కు భూరక్ష పథకంగా భాగంగా డ్రోన్లు సాయంతో పక్కాగా సర్వే చేస్తున్నట్లు మండల సర్వేయర్ హజరత్తయ్య తెలిపారు. మండలంలోని తుమ్మలతలుపూరు, పెరుమాళ్లపాడు, చెర్లోపల్లె, ఓరుపల్లె గ్రామాల్లో శుక్రవారం డ్రోన్లు సర్వే ప్రారంభించారు. రీసర్వే డీటీ ప్రసాద్, వీఆర్వోలు హరిబాబు, సర్వేయర్ అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రీసర్వే

ఓజిలి: గ్రామీణ ప్రాంతాల్లోని భూ సమస్యలను పరిష్కరించేందుకు రీసర్వే చేస్తున్నట్లు తహసీల్దార్ లాజరస్ తెలిపారు. మండలంలోని ఆర్మేనిపాడు సచివాలయం వద్ద రీసర్వే పూర్తి అయిన సందర్భంగా గ్రామసభ శుక్రవారం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పరిష్కరించని భూ సమస్యలను కూడా ఈ సర్వేలో పరిష్కారం చూపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గుంటమడుగు రవీంద్రరాజు, ఎంపీటీసీ సభ్యుడు గుంటమడుగు రఘురామరాజు, వీఆర్వోలు తిరుపాలయ్య, నిరంజన్ పాల్గొన్నారు.

వందే భారత్ రైలు ఆపాలని వినతి

గూడూరు: స్థానిక రైల్వేస్టేషన్ జంక్షన్ అయిన కారణంగా త్వరలో ప్రారంభించనున్న వందే భారత్ రైలు ఆపాలని ఆర్‌యూసీసీ సభ్యుడు డాక్టర్ శ్యాం సుందర్‌రావు శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. సికింద్రాబాద్ నుంచి తిరుపతికి నడపనున్న వందే భారత్ రైలుకు గూడూరులో స్టాపింగ్ లేదని గతంలో ప్రకటించారని, గూడూరు రైల్వే జంక్షన్ అని, అలాగే చెన్నై, తిరుపతి ప్రాంతాలకు వెళ్లేందుకు గూడూరు నుంచి రోజూ వందల మంది ప్రయాణిస్తుంటారని తెలిపారు.

పరీక్షల సామగ్రి పంపిణీ

గూడూరురూరల్: మండలంలోని కొండాగుంట జెడ్పీ హైస్కూలులో శుక్రవారం రోటరీ వెస్ట్ గూడూరు క్లబ్ ఆధ్వర్యంలో 50 మంది పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. ఆ పాఠశాలలో పనిచేస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు, రొటేరియన్ నందిమండలం కృష్ణంరాజు వీటిని వితరణ చేశారు. క్లబ్ అధ్యక్షుడు ధనుంజయరెడ్డి, హెచ్‌ఎం కోటేశ్వరరావు, పీసీ చైర్మన్ బాబు, వాసు గౌడ్, హరినాథరెడ్డి, బలరాంరెడ్డి పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ఏర్పాటు

చిల్లకూరు: మండలంలోని పల్లెవానిదిబ్బ గ్రామంలో శుక్రవారం నెక్కంటి ఆక్వా పరిశ్రమ ఆధ్వర్యంలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ప్లాంట్‌ను ఏఎంసీ మాజీ చైర్మన్ యరటపల్లి జానకిరామిరెడ్డి చేతుల మీదుగా శుక్రవారం ప్రారంభించారు. పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

తిరునాళ్లు విజయవంతం చేయాలి

దక్కిలి: దేవునివెల్లంపల్లెలో ఉన్న స్తంభాలగిరీశ్వరయ్యస్వామి ఆలయంలో ఈ నెల 9వ తేదీ నుంచి మూడు రోజులు పాటు జరగనున్న స్వామివారి తిరుణాళ్లను విజయవంతం చేయాలని గూడూరు ఆర్డీఓ కిరణ్ కుమార్ తెలిపారు. దేవునివెల్లంపల్లెలోని స్తంభాలగిరీశ్వరయ్యస్వామి ఆలయంలో శుక్రవారం దేవదాయశాఖ, ఆలయ కమిటీ, వివిధ శాఖల అధికారులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ తిరుణాళ్లకు లక్షలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని అన్నీ శాఖల అధికారులు సమన్వయంతో కలిసి కట్టుగా పని చేయాలని సూచించారు. సర్పంచ్ చింతపూడి సుజాత, ఆలయ చైర్మన్ నర్రావుల ప్రకాశం నాయుడు, ఈఓ శ్రీధర్‌నాయుడు, తహసీల్దార్ రమేష్‌బాబు, ఎంపీడీఓ కోటేశ్వరరావు, ఎస్‌ఐ నాగరాజు, ట్రాన్స్‌కో ఏఈఈ జహీర్ అహ్మద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ నాగరాజు, ఎంఈఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే జగనన్న ధ్యేయం



రాపూరులో సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి, మేరిగ మురళీధర్

రాపూరు: మహిళల ఆర్థికాభివృద్ధే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మద్దెలమడుగు వద్ద ఉన్న ఏఎంసీ ప్రాంగణంలో శుక్రవారం వైఎస్సార్ ఆసరా చెక్కులు, పది పొదుపు గ్రూపులకు గొర్రె పిల్లలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ బంగారు రాష్ట్రంగా మారాలంటే మహిళలతోనే సాధ్యం అవుతుందన్నారు. రూపాయిని రెండు రూపాయలుగా పెంచే శక్తి మహిళలకే ఉందని, దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి గుర్తించి, పొదుపు గ్రూపులను ఏర్పాటు చేశారని చెప్పారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పొదుపు మహిళలకు పలు ప్రయోజనాలు కల్పిస్తూ వారు ఆర్థికంగా స్థిరపడాలని కోరుకుంటున్నారని చెప్పారు. ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ మాట్లాడుతూ పొదుపు గ్రూపుల మహిళలు ఆర్థికంగా స్థిరపడేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న పథకాలు కల్పవృక్షంగా మారాయని అన్నారు. అనంతరం ఆసరా చెక్కులు పంపిణీ చేసి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి బత్తిన పట్టాభిరామిరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ గంగిశెట్టి వెంకటేశ్వర్లు, జేసీఎస్ కన్వీనర్ దందోలు నారాయణరెడ్డి, వ్యవసాయ సలహ మండలి చైర్మన్ నెల్లూరు రవీంద్రారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాపకన్ను దయాకర్‌రెడ్డి, శశిరెడ్డి, కలపాటి మదుసూధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణముఖి నదికి 3 టీఎంసీల నీరివ్వండి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కళ్యాణ్ చక్రవర్తి

గూడూరు: స్వర్ణముఖి నదికి 3 టీఎంసీల తెలుగు గంగ నీటిని ఇవ్వాలని ఉమ్మడి నెల్లూరు జిల్లా జెడ్పీ సమావేశంలో ఎమ్మెల్సీ కళ్యాణ్ చక్రవర్తి కోరారు. నెల్లూరులోని జెడ్పీ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డు సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ గూడూరు స్వర్ణముఖి నదికి 3 టీఎంసీల తెలుగు గంగ నీటిని విడుదల చేయడం ద్వారా సూళ్లూరుపేట నియోజకవర్గంలోని కోట, వాకాడు, చిట్టమూరు, పెళ్లకూరు, ఓజిలి, నాయుడుపేట మండలాలకు చెందిన 48 చెరువులకు నీరందుతుందన్నారు. దీంతో 30,121 ఎకరాలకు సాగు నీరందుతుందన్నారు. అలాగే తాగునీటికి 0.75 టీఎంసీలు ఉపయోగపడతాయని చెప్పారు. నది విస్తీర్ణంతోపాటు, వెడల్పుగా ఉన్న కారణంగా 0.75 టీఎంసీ నీరు ఆవిరి అవుతుందని, ఈ లెక్కల ప్రకారం 3 టీఎంసీల నీటిని ఇస్తే నియోజకవర్గంలోని రైతులకు సాగునీటితోపాటు, తాగునీటి అవసరాలను కూడా తీర్చినట్లు అవుతుందని చెప్పారు.

ప్రశాంతంగా మున్సిపల్ మీట్



చైర్‌పర్సన్ నక్కాభానుప్రియకు వినతి పత్రం అందజేస్తున్న కౌన్సిలర్ శంకరయ్య

వెంకటగిరి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ అధ్యక్షతన జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ప్రశాతంగా ముగిసింది. 21వ వార్డు కౌన్సిలర్ ఢిల్లీబాబు మాట్లాడుతూ తమ వార్డులో తమకు తెలియకుండా రూ.12.50 లక్షలు, రూ.4 లక్షలతో పనులు పూర్తి చేసినట్లు రికార్డుల్లో ఉందన్నారు. ఈ పనులు ఎక్కడా చేశారో చూపించాలన్నారు. 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య మాట్లాడుతూ తమ వార్డులో ఇప్పటివరకు ఒక అభివృద్ధి పని కూడా జరగలేదన్నారు. 15వ వార్డు కౌన్సిలర్ దొంతు శారద మాట్లాడుతూ అభివృద్ధి పనులు, బిల్లుల వివరాలు తెలపాలని కోరారు. 16వ వార్డు కౌన్సిలర్ ధనియాల రాధ మాట్లాడుతూ అధికారులు వార్డుల్లో పర్యటించే సమయంలో కౌన్సిలర్లకు కనీస సమాచారం ఇవ్వాలన్నారు. 21వ వార్డు కౌన్సిలర్ ఆటంబాకం శ్రీనివాసులు మాట్లాడుతూ వార్డుల్లో గుంతల పూడ్చివేత పనులు చేపట్టాలని ఆదేశించారు. 5, 6వ వార్డు కౌన్సిలర్ మాడా జానకిరామ్, చంద్రశేఖర్ మాట్లాడుతూ తమ వార్డుల్లో శ్మశాన వాటికను సర్వే చేయించి, ప్రహరీ ఏర్పాటు చేయాలని కోరారు. 4వ వార్డు కౌన్సిలర్ నారాయణ మాట్లాడుతూ శివారు ప్రాంతాల్లోని ప్రజలకు తాగునీటి సరఫరా చేయాలని కోరారు.

జనార్దన్‌రెడ్డి విగ్రహం ఏర్పాటుకు వినతి

మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి కాంస్య విగ్రహాన్ని పట్టణంలోని క్రాస్‌రోడ్డు సెంటర్‌లో ఏర్పాటు చేయాలని 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కాభానుప్రియకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

సూళ్లూరుపేట రూరల్: స్థానిక ఆర్టీసీ డిపో వద్ద నేషనల్ మజ్దూర్ యూనియన్ నూతన కార్యవర్గ ఎన్నిక శుక్రవారం నిర్వహించారు. డిపో అధ్యక్షుడిగా డి.పోలయ్య, కార్యదర్శిగా సుబ్రమణ్యం, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎం.రాజేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పెరుమాళ్, ఆ సంఘం స్థానిక డిపో గౌరవాధ్యక్షుడు అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు నిర్వహించారు.

14 అంశాలకు ఆమోదం



మాట్లాడుతున్న చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి

సూళ్లూరుపేటరూరల్: పట్టణంలో స్త్రీశక్తి భవనంలో శుక్రవారం చైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డి అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ముందుగా అజెండాలోని 14 అంశాలపై చర్చించి ఆమోదం తెలిపారు. అనంతరం టేబుల్ అజెండా కింద మరో ఐదు అంశాలను కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. పలువురు సభ్యులు మున్సిపాలిటీలో సమస్యలు పరిష్కరించాలని కోరారు. చైర్మన్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ నాగిశెట్టి నరేంద్ర పాల్గొన్నారు.

మేనిఫెస్టో అమలు ఘనత జగన్‌దే



గూడూరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు



గూడూరు రూరల్: పొదుపు మహిళలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్ రావు

గూడూరు: అధికారంలోకి వచ్చిన తరువాత అందరూ ఎన్నికల మ్యానిఫెస్టోను మరచిపోయినవారేనని, కానీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం దాన్ని వందశాతం అమలు చేసిన ఘనత దక్కించుకున్నారని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు అన్నారు. పట్టణంలోని షాదీమంజిల్‌లో శుక్రవారం మూడో విడత వైఎస్సార్ ఆసరా పథకం చెక్కును ఆయన మహిళలకు అందజేశారు. ముందుగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని 843 పొదుపు సంఘాలకు రూ. 6,64,21,419 అందజేశామన్నారు. రాబోయే ఎన్నికల్లో కూడా మీరంతా మన జగన్‌మోహన్‌రెడ్డిని ఆదరించి, ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సాయినాథ్, వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, బత్తిని విజయ్‌కుమార్, యారం మంజుల, పార్టీ పట్టణ అధ్యక్షుడు బీ శ్రీనివాసులు, టీ శ్రీనివాసులు, మురళి, మల్లిగౌడ్ అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా నిలుస్తాం

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అక్రమ కేసులు బనాయించిన దాఖలాలు లేవని, పార్టీలకతీతంగా బాధితులకు అండగా నిలుస్తామని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు అన్నారు. గూడూరు రూరల్ మండలం రామలింగాపురం గ్రామానికి చెందిన సుప్రజ తన ముగ్గురు పిల్లలతో కలసి వచ్చి, తన భర్త తనతోపాటు బిడ్డల్ని వదిలేశాడని, తనకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే నివాసంలో శుక్రవారం ఆయన్ని కలిసి విన్నవించింది. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ సుప్రజ భర్త కృష్ణయ్య, నాయుడుపేట మండలంలోని పుదూరు గ్రామానికి చెందిన వ్యక్తి కావడంతో సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి వారికి కౌన్సెలింగ్ ఇచ్చి, న్యాయం చేయాలని సిఫార్సు చేశానని చెప్పారు.

మహిళా సాధికారతే జగనన్న లక్ష్యం

గూడూరురూరల్: మహిళా సాధికారతే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు అన్నారు. గూడూరు తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో మండలంలోని 809 పొదుపు సంఘాల్లోని 7,435 మంది సభ్యులకు రూ.5,05,75,497 నగదు చెక్కులు అందజేశారు. ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు మాట్లాడుతూ పొదుపు సంఘాల్లోని పేద మహిళల ఆర్థికాభివృద్ధికి ఆసరా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఫ్లెక్సీకి ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు మహిళలతో కలసి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మెడనూలు శ్రీనివాసులురెడ్డి, మైనార్టీ నాయకులు మొబీన్‌బాషా, ఏఎంసీ వైస్ చైర్మన్ కొట్టు గోవర్ధన్, మనుబోలు కృష్ణయ్య, జేసీఎస్ మండల కన్వీనర్ శ్రీహరి, సర్పంచ్‌లు బల్లి వెంకటేశ్వర్లు, రమణమ్మ, అట్రాసిటీ కమిటీ సభ్యుడు ఎన్..వి.రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పెద్దిరెడ్డికి ఘన స్వాగతం



మంత్రి పెద్దిరెడ్డిని సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నాయుడుపేటటౌన్: రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి శుక్రవారం నాయుడుపేటలో వైఎస్సార్ సీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. మంత్రి తిరుపతి నుంచి విజయవాడకు రోడ్డు మార్గంలో వెళుతుండగా మార్గం మధ్యలో నాయుడుపేట పట్టణ పరిధిలోని జువ్వలపాళెం క్రాస్ రోడ్డు వద్ద వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి సారథ్యంలో ఆ పార్టీ నాయకులు మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా నాయకులు మంత్రికి శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు టీ బలరామిరెడ్డి, నాగిరెడ్డి కుమార్‌రెడ్డి, జువ్వలపాళెం మాజీ సర్పంచ్ సుబ్రహ్మణ్యం, ఆట్లా కృష్ణారావు, తింగారెడ్డి సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి



కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న చైర్‌పర్సన్ కటకం దీపిక

నాయుడుపేటటౌన్: మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కౌన్సిల్ సభ్యులు అధికారులకు చూచించారు. నాయుడుపేట మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం చైర్‌పర్సన్ కటకం దీపిక అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తొలుత అజెండాలో రూపొందించిన 49 అంశాలకు సంబంధించి పనులపై చర్చించారు. మున్సిపాలిటీలో రెండు ప్రైవేట్ సంస్థల గ్యాస్, వాటర్ పైప్‌లైన్ ఏర్పాటు చేసే క్రమంలో సిమెంట్ రోడ్డు ధ్వంసం చేస్తున్నాయని, తిరిగి రోడ్ల నిర్మాణంలో జాప్యం జరుగుతుందని కౌన్సిల్ సభ్యులు ఆరోపించారు. దీనిపై స్పందించిన కమిషనర్ ఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ పగులగొట్టిన సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులు ఆ సంస్థ వారే తిరిగి నిర్మించే పనిని కొద్ది రోజులు కిందట ప్రారంభించారని, ఏప్రిల్ 30 తేదీ లోపు పనులు పూర్తి చేస్తారని చెప్పారు. అభివృద్ధి పనులకు సంబంధించి వివరాలను కౌన్సిలర్లకు ఇవ్వాలని కౌన్సిలర్ పాపాడి చంద్రారెడ్డి కోరారు. నాయుడుపేట రోటరీ క్లబ్ 3 సెంట్ల స్థలం కేటాయించాలని వైస్ చైర్మన్ షేక్‌రఫీ, చైర్‌పర్సన్‌కు వినతి పత్రం అందజేశారు. కౌన్సిలర్లు దారా రవి, చంద్రారెడ్డి, పాలేటి నాగార్జున, కావేరి పాకం అశోక్ కుమార్, తోడకాటి విజయ్, కోఆప్షన్ సభ్యుడు చదలవాడ కుమార్, భవాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పంచాయతీకి సహకరించండి

నాయుడుపేట: మేనకూరును ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దేందుకు అధికారులు సహకరించాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి కట్టా సుధాకర్ రెడ్డి కోరారు. మండలంలోని మేనకూరులో చెత్త సంపద తయారీ కేంద్రం వద్ద పలు మండలాలకు చెందిన సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు జరిగిన శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సర్పంచ్ సీహెచ్ సురేష్, జెడ్పీటీసీ సభ్యురాలు కట్టా జ్యోతిరెడ్డి, డీఎల్‌పీఓ వెంకటరమణ, రీసోర్స్ పర్సన్‌లు వెంకట్రావ్, వెంకట్రాది, ఏకొల్లు సర్పంచ్ బెస్లీ, అనిల్ పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

దొరవారిసత్రం: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ దువ్వూరు సుజాతమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ సింగయ్య తెలిపారు. ఈ సమావేశంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

వైభవంగా శ్రీరామనవమి

సైదాపురం: శ్రీరామనవమి వేడుకలు శుక్రవారం నిర్వహించారు. మండలంలోని ఊటుకూరు రామ మందిరంలో స్వామివారికి అభిషేకం చేశారు. స్వామివారికి పల్లకి సేవ జరిపారు.